పేదల పక్షపాతి సీఎం జగన్



16వ డివిజన్‌లో రిజిస్ట్రేషన్ పట్టా అందిస్తున్న కార్పొరేటర్ విజయనిర్మల, రమేష్



కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు



7వ డివిజన్‌లో రిజిస్ట్రేషన్ పట్టా అందిస్తున్న కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి

ఏలూరులో జోరుగా ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి పేదవాడికీ గూడు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో లక్షలాదిమందికి ఇళ్ల పట్టాలను అందజేశారని, ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో 33 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు అందజేయగా, తాజాగా పూర్తిహక్కులతో రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమం ఏలూరులో శరవేగంగా సాగుతోంది. ఎమ్మెల్యే నాని ఆదేశాలతో నగరంలోని అన్ని డివిజన్లలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేస్తున్నారు. వన్‌టౌన్‌లోని 16వ డివిజన్‌లో కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు జిజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో వందలాదిమంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో పేదలకు మంచి చేయాలనే ఆలోచన చేయలేదని ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో చంద్రబాబు ఒక్క గజం స్థలం కూడా ఇవ్వకుండా నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న చేస్తోన్న మంచిని విమర్శించటం సిగ్గుచేటని అన్నారు. ఎమ్మెల్యే నానితోనే నగరంలో పేదలకు మంచి జరిగిందని చెప్పారు.

● వన్‌టౌన్ 7వ డివిజన్‌లో కార్పొరేటర్, క్లస్టర్–1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి చేతులమీదుగా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరులో వేలాదిమంది పేదలకు ఇళ్ల స్థలాలను అందించిన ఘనత ఎమ్మెల్యే ఆళ్ల నానికే దక్కుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి ఎమ్మెల్యే నానిని గెలిపించాలని కోరారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదకు చేయూత



సత్యవతికి చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు రూరల్ : ఎమ్మెల్యే ఆళ్ల నాని సహకారంతో నిరుపేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందించామని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న డెక్కత సత్యవతికి వైద్యం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ రూ.28 వేల చెక్కును ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో అందజేశారని పేర్కొన్నారు.

గృహ సందర్శనలు



బాలింతకు సూచనలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం గృహ సందర్శనలు చేశారు. ఏలూరు అర్బన్ ప్రాజెక్టు యాదవ నగర్ మొదటి సెక్టార్ పరిధిలోని యాదవ్ నగర్–2, వెంకట్రావుపేట, ముస్లిం బజార్–1 అంగన్‌వాడీలు పలు ఏరియాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ బి.మంగ గర్భిణులు, బాలింతలు, లోప పోషణ ఉన్న చిన్నారుల గృహ సందర్శన చేశారు. ఆరోగ్య సూచనలు, పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్యామల, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.అరుణ, శశికళ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరుద్యోగులకు అవగాహన

ఏలూరు(మెట్రో): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ ఫీల్డ్‌పై ఎస్ఏఎల్ఆర్ఎం డైరెక్టర్ అవగాహన కల్పిస్తారని జిల్లా ఉపాధి అధికారి సి.మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఈనెల 16 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత గలవారికి, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ అర్హత గల నిరుద్యోగ యువతకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. అర్హులంతా హాజరుకావాలని కోరారు.

అలరించిన 'శ్రీకృష్ణ రాయబారం'



శ్రీకృష్ణ రాయబారం నాటకంలో దుర్యోధనుని పాత్రధారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పెరికిగూడెంకు చెందిన శ్యామలాంబ కళానికేతన్ ఆధ్వర్యంలో సింహాచలం సీతారామయ్య సమర్పణలో నిర్వహించిన శ్రీ కృష్ణ రాయబారం పౌరాణిక నాటకం భక్తులను అలరించింది. శ్రీకృష్ణునిగా బి.అప్పారావు, దుర్యోధనునిగా ఎస్ సీతారామయ్య, ధృతరాష్ట్రునిగా శ్రీరత్నజీ, ద్రోణునిగా రాఘవులు, కర్ణునిగా వి.రామాంజనేయులు పౌరాణిక పద్యాలతో నాటకాన్ని రక్తికట్టించారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఉదయం 9 గంటలకు గాదంశెట్టి రమేష్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వివేకానంద కేంద్ర కన్యాకుమారి, ఆంధ్ర, తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ ఇన్‌చార్జి సీవీ సదాశివరావు దేశభక్తి – దైవభక్తి అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సైనిక సంక్షేమ నిధికి వితరణ



సైనిక సంక్షేమ నిధికి విరాళం చెక్ కలెక్టర్‌కు అందిస్తున్న అధికారులు

ఏలూరు(మెట్రో) : దేశ రక్షణకోసం కర్తవ్యనిష్టతో సేవలందించిన మాజీ సైనికులను ఆదుకోవడం, చేయూతనందించడం విద్యుక్త ధర్మమని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. కోస్టల్ బ్యాంక్ (విజయవాడ) శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమ నిధికి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోస్టల్ బ్యాంక్ సీసీఓ వై.సత్యనారాయణ, ఇతర బ్యాంక్ అధికారులను అభినందించారు. మాజీ సైనికులు, సైనిక కుటుంబాలను ఆదుకునే అవకాశాన్ని కోస్టల్ బ్యాంక్ తీసుకోవడం అభినందనీయమన్నారు. కోస్టల్ బ్యాంక్ సీసీఓ వై.సత్యనారాయణ మాట్లాడుతూ తమ బ్యాంక్ రూ.750 కోట్ల డిపాజిట్లు కలిగి, రూ.625 కోట్ల లోన్లతో 50 శాఖల ద్వారా అన్ని వర్గాల వారికీ అందుబాటులో ఉండటమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ క్లస్టర్ హెడ్ టి.రామకృష్ణ, బ్రాంచ్ మేనేజరు ఎంవీఎల్ మాధురి, జిల్లా సైనిక సంక్షేమాధికారి కేవీ సాయి ప్రసాదరావు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజక వృత్తిదారుల చెరువులపై గ్రామ పంచాయతీల అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజక వృత్తిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య ఆరోపించారు. ఏలూరు ఉమ్మడి జిల్లా రజక సంఘం భవనంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక జీఓలు ఇచ్చినా అధికారుల నిర్లక్ష్య వైఖరితో రజకులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంతో 50 కుటుంబాల రజకులు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆ గ్రామంలో మూడు చెరువులు ఉన్నప్పటికీ ఏ ఒక్క చెరువును కూడా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రజకులకు కేటాయించకపోవడం విచారకరమని చెప్పారు. తేలుకుంట చెరువునే రజకులకు కేటాయించి, పక్కనున్న 40 సెంట్లు స్థలాన్ని బట్టలు ఆరబెట్టుకొనేందుకు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఈదర గ్రామ రజక సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బుద్ధవరపు నారాయణ,కార్యదర్శిగా బి.గోపిరాజు, సహాయ సభ్యులుగా ఆసానుబాదు జమలయ్య, గర్నేపల్లి జలమయ్య, బుద్ధవరపు నాగేశ్వరరావు, జి.నాగశేషగిరిరావు, బి.తిరుపతయ్య, బుద్ధవరపు రమేష్‌లను ఎన్నుకున్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన అవసరం



సుధాకర్‌ను సన్మానిస్తున్న యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి వినియోగదారుడూ తాను కొనుగోలు చేసే వస్తువుకు సంబంధించిన తూనికలు, కొలతల విషయంలో పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ పి.సుధాకర్, డిప్యూటీ కంట్రోలర్ బీవీ హరి ప్రసాద్ సూచించారు. యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో వినియోగదారుల హక్కుల దినోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. వినియోగదారుడు మార్కెట్‌లో కొనుగోలు చేసే వస్తువులు, తినుబండారాల ప్యాకెట్ల విషయంలో తయారీ చిరునామా, గరిష్ట అమ్మకం ధర, వస్తువు కాలపరిమితి తేదీ, బరువు, ప్యాకెట్లో ఉన్న వస్తువు పేరు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎండీహెచ్ మెహర్రాజ్, నేషనల్ కెరీర్ సర్వీస్ జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రవీణ్ కృష్ణ, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎన్ సత్యనారాయణ, పర్యవేక్షకులు కేజే కెనడీ, తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కుమార్, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామం మొండికోడులో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఉదయం 8.49 నిమషాలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. దంపతులు, భక్తులు పూజల్లో పాల్గొంటారన్నారు. పెరవలిలో రూపుదిద్దుకున్న 15 అడుగుల భారీ విగ్రహాన్ని ట్రాలీపై తీసుకొచ్చినట్టు చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధిని గడపగడపకూ వివరించండి

పెదవేగి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, మౌలికల వసతుల కల్పనను ప్రతి గ్రామంలో గడపగడపకూ వైఎస్సార్ సీపీ శ్రేణులు వివరించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో మండలంలోని పోతునూరు, కొవ్వలి, గోపన్నపాలెం గ్రామాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైఎస్సార్ సీపీకి చెందిన అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు ప్రణాళిక, సమన్వయంతో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. బూత్ కమిటీలు పకడ్బందీగా పనిచేసేలా పార్టీ నాయకులు, గృహసారథులు నిత్యం వారితో మాట్లాడాలన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రతి లబ్ధిదారుడికి నేరుగా వైఎస్సార్ సీపీ శ్రేణులు వివరించి మద్దతు కోరాలన్నారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమంతో పాటు నవరత్న పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వేమూరి జితేంద్ర, మండల ఉపాధ్యక్షుడు గొల్ల నాగరాజు, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి, సర్పంచ్‌లు బోదుల స్వరూప్, ఇంటేటి మధులత గంగాధర్, కోటే నాగ మల్లేశ్వరి కుమార్, నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు

పెదవేగి : వంగూరు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం ఆవిష్కరించారు. అబ్బయ్యచౌదరికి వంగూరు గ్రామ ప్రజలు, వైఎస్సార్ సీపీ యువ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ముందుగా వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొఠారు, దివంగత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరించి జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.40 కోట్ల నిధులతో గ్రామాభివృద్ధికి బాటలు వేశామన్నారు. గ్రామంలో 4 ఎకరాల భూమి కొనుగోలు చేసి, తొలి విడతగా 170 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ స్థలం కేటాయించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా వంగూరు గ్రామ అభివృద్ధికి దాదాపుగా రూ.40 కోట్లు మంజూరు చేశానన్నారు. వంగూరు వైఎస్సార్ సీపీ యువనేత కేశన సతీష్ నాయకత్వంలో వంగూరు అభివృద్ధిలో ముందుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు 70 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, సర్పంచ్ చీలి రూతు, ఎంపీటీసీ మరియమ్మ, బీసీ నాయకుడు ఘంటా ప్రసాద్, కేసిన సతీష్ మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, డ్వాక్రా వీఓఏలు, వలంటీర్లు ఎమ్మెల్యేకు మెమెంటోలు, జ్ఞాపికలు, దుశ్శాలువాతో సత్కరించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీసీపీఓ సూర్యచక్రవేణి

ఏలూరు (టూటౌన్) : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి హెచ్చరించారు. ఏలూరు జిల్లా బాలల సంరక్షణ యూనిట్‌కు వచ్చిన సమాచారం మేరకు ఐసీడీఎస్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన బాలిక ఇంటికెళ్లి వివాహాన్ని నిలుపుదల చేశారు. బాలికకు, వరుడుకి, వారి తల్లిదండ్రులకు ఏలూరు డీసీపీఓ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచక్రవేణి మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం–2006 ప్రకారం తీసుకునే చట్టపరమైన చర్యలను వివరించారు. బాలికను విద్య, వసతి నిమిత్తం బాలకల వసతి గృహానికి తరలించినట్టు చైల్డ్‌లైన్–1098 కోఆర్డినేటర్ వైవీ రాజు తెలిపారు. వధువు, వరుడు తల్లిదండ్రుల నుంచి అఫిడవిట్‌ను పెదవేగి తహసీల్దార్ సూర్యప్రభ, ఐసీడీఎస్ పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బైండోవర్ తీసుకున్నారు. కార్యక్రమంలో పెదవేగి సూపర్ వైజర్ శాంత, కొప్పాక సచివాలయం మహిళాకార్యదర్శి కుసుమ పాల్గొన్నారు.

నేడు బాల అయ్యప్ప క్షేత్రం వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడులోని బాల అయ్యప్ప క్షేత్రం 13వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు 11 రకాల ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం, 8 గంటలకు లక్ష్మీగణపతి హోమం, 10 గంటలకు పూర్ణాహుతి, ప్రసాద వితరణ, 10.30 గంటలకు నగరానికి చెందిన ప్రముఖ గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తి రంజని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్వామి వారికి పుష్పాలంకరణ, 11.30 గంటలకు శ్రీ బాల అయ్యప్ప కోలాట భజన బృందం కోలాట ప్రదర్శన, 12 గంటలకు అఖండ అన్న సమారాధన, సాయంత్రం 6.30 గంటలకు శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, రాత్రి 8 గంటలకు ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఉచిత చర్మ వ్యాధులు, దంత వ్యాధుల వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గ్రామ శివారు ప్రాంతాల ప్రజలందరికీ వరమని సానిగూడెం సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ (విష్ణు) అన్నారు. శుక్రవారం సానిగూడెం వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లోని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీడీఓ పీ.శ్రీలత ప్రారంభించారు. సానిగూడెం శివారు ప్రాంతంలో 235 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్, నాయకులు రాజేష్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ట్రై సైకిల్ అందజేత

దెందులూరు: మేధినరావుపాలెం గ్రామానికి చెందిన ప్రత్యేక అవసరాలు గల వ్యక్తి తానిగడప రాంబాబుకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని శుక్రవారం రూ.11 వేల విలువ గల ట్రై సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మేధినరావుపాలెం ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మేడికొండ రాజా, జొన్నకూటి మంగరావు, కార్యకర్తలు పాల్గొన్నారు. లబ్ధిదారుడు తానిగడప రాంబాబు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

పెదవేగి : త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెదవేగి మండలం కొప్పాక, పెదకడిమి, అంకన్నగూడెం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య సూచనల మేరకు, పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

క్రీస్తు బాటలో పయనించాలి

పెదవేగి : ప్రతి వ్యక్తి ఏసుక్రీస్తు చూపిన బాటలో పయనించాలని విజయవాడ పీఠం వెలగల గూడెం విచారణ గురువులు ఫాదర్ డానియల్ అన్నారు. పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామ విచారణలో రెండవ రోజు క్రీస్తులో నూత్నీకరణ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు విచారణ గురువులు ఫాదర్ రాచూరి బాలస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో విచారణ పరిధిలోని విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వరాజ్యలక్ష్మికి గ్రేడ్–1 కార్యదర్శిగా పదోన్నతి

దెందులూరు: గాలాయగూడెం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న కే.స్వరాజ్యలక్ష్మికి గ్రేడ్–1 కార్యదర్శిగా పదోన్నతి లభించింది. దీనికి సంబంధించి శుక్రవా రం జిల్లా పంచాయతీఅధికారి ఆదేశాలు జారీచేశారు. మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు స్వరాజ్యలక్ష్మికి అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	03
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	--

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	20	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	32
కాకర కాయలు	36–48	కీరా దోస	40
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	80
కాలీఫ్లవర్	30	అల్లం	140
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36–40	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24–28	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	30

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
ITL DI 74042 TRACTOR
2021 MODEL AP39 MA 9880
Cell : 98854 63123
23B-5-93, 1st Floor, Ward No. 26,
Edara Vari Street, Powerpet, ELURU.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
96408 32693
Office mail : tpgadvt@gmail.com